

## జవహార్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి

- పార్టీలకు అతీతంగా డంపింగ్ యార్డ్ ను సందర్శించిన నాయకులు
- రాంకీ సంస్థ ప్రతినిధులతో చర్చలు

**కీసర, మే 22 (జనం వార్త) :** జవహార్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి శక్తివంతం లేకుండా కృషి చేస్తామని మల్కాజి గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డంపింగ్ యార్డ్ ను ఎంపీ ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి లు శుక్రవారం డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. అనంతరం రాంకీ సంస్థ ప్రతినిధులతో డంపింగ్ యార్డ్ సమస్యపై చర్చలు జరిపారు. ప్రతిరోజు వచ్చే చెత్త ఎంత? చెత్త శుద్ధికరణ కోసం ఎలాంటి పద్ధతులు అవలంబిస్తున్నారని నాయకులు రాంకీ సంస్థ వారిని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి,మాజీ మేయర్ కావ్య,మాజీ చైర్మన్ చంద్రారెడ్డి,మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,పంగ హరిబాబు, అన్నంరాజు సురేష్, సాయినాథ్ గౌడ్,నక్క కిషోర్ గౌడ్,రాజశేఖర్, రవీందర్ రెడ్డి,రాజు గౌడ్,జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బసవరాజుతో బ్రాహ్మణ పరిషత్ పరుగులు పెట్టాలి

**బ్రాహ్మణ సంఘం నాయకులు జాలీగామ వి ఎల్ నరసింహారావు**

**రంగారెడ్డి ప్రతినిధి, మే 22:** ఇటీవల అధికారికంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బసవరాజు శ్రీనివాసుని ప్రముఖ బ్రాహ్మణ సంఘం నాయకులు జాలీగామా వి ఎల్ నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి వారికి ఘన సన్మానం చేశారు ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అభివృద్ధి పథంలో పురోగమించాలని ప్రతి పేద బ్రాహ్మణుడికి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ నేతృత్వంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరుగులు పెట్టాలని ఆకాంక్షించారు.

## ఏసీబీ విచారణలో ఉన్న అధికారులను వెంటనే బదిలీ చేయాలి

**ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పెల్లి యుగంధర్ డిమాండ్**



**కరీంనగర్, మే 22:** మహిళా శిశు సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి ఆరోపణలు, ఏసీబీ విచారణల నేపథ్యంలో కరీంనగర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సంబంధిత అధికారులను తక్షణమే బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పెల్లి యుగంధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల వరంగల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులపై ఏసీబీ దాడులు, విచారణలు కొనసాగుతున్న తరుణంలో కరీంనగర్ జిల్లాలో కూడా జిల్లా సంక్షేమ అధికారి సహా పలువురు అధికారులపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో విచారణ ఎదుర్కొంటున్న అధికారులను అదే స్థానాల్లో కొనసాగించడం వలన సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే ప్రమాదం ఉందని, అలాగే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఒత్తిడి, వేధింపులు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా సంక్షేమ అధికారిపై శాఖ ఉద్యోగులు పలుమార్లు వేధింపుల ఆరోపణలు చేస్తూ అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. శాఖలో పనిచేస్తున్న కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేధింపులు భరించలేక రాజీనామా చేసిన ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక సమావేశంలో పోషణ అభియాన్ విభాగానికి చెందిన మహిళా ఉద్యోగినిని అంగన్వాడీ టీచర్లు, మండల అధికారుల సమక్షంలో అవమానకరంగా దూషించడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఉద్యోగానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించి, భయభ్రాంతులకు గురికాకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని యుగంధర్ విజ్ఞప్తి చేశారు.

# కూకట్‌పల్లిలో స్మశాన వాటిక కబ్జాకు యత్నం

- చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను అడ్డుకున్న కబ్జా దారులు
- రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన
- ఈ భూమి మా తాతల ఆస్తి : మనవళ్లు వినయ్, విజయ్



**కూకట్ పల్లి, మే 22, (జనం వార్త) :** కూకట్ పల్లి దయార్ గుడలోని పురాతన స్మశాన వాటికను కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని కూకట్ పల్లి రజక సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పురాతన స్మశాన వాటికలో చాకలి ఐలమ్మ విగ్రహన్ని ప్రతిష్టాపించడానికి నాయకులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది వ్యక్తులు ఈ స్థలం తమదేనంటూ విగ్రహ ప్రతిష్టాపనను అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూకట్ పల్లి రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి ముసలి శివలు మాట్లాడుతూ మా తాతల కాలం నుండి ఈ ప్రాంతాన్ని స్మశాన వాటిక వాడుకుంటున్నామని 1986లో అప్పటి మున్సిపల్ చైర్ పర్సన్ హనుమంతరావు సమక్షంలో స్థల యజమాని నాయినేని లింగారావు కూకట్ పల్లి గ్రామ పరిధి లోని సర్వే నెంబర్ 174,175 కంకర బావిలో రజకుల స్మశాన వాటిక కోసం 800 గజాల ఈ స్థలాన్ని దానం చేశారన్నారు. అప్పటినుండి ఈ స్థలాన్ని స్మశాన వాటికగా ఉపయోగిస్తున్నామన్నారు. 1997 అనంతరం ఈ స్మశాన వాటిక చుట్టూ నివాస గృహాలు నిర్మాణం కావడంతో అప్పటి ఊరి పెద్దల సూచన మేరకు జాతీయ రహదారి అవతలి వైపు స్మశాన వాటిక ఏర్పాటు చేసుకున్నా మన్నారు. ఈ స్థలాన్ని రజకులకు మరొరకంగా ఉపయోగపడేలా చేయాలనే ఉద్దేశం తో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం అయ్యామన్నారు. గత కొన్ని రోజులుగా రజకులకు చెందిన స్థలం తమదంటూ నాయినేని లింగారావు మనవళ్లు నాయినేని వినయ్, నాయినేని విజయ్ లు భూమిని స్వాధీనం చేసుకునేందు ప్రయత్నించి ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రయత్నించడంతో రజక సంఘం నాయకులందరం అడ్డుకున్నామన్నారు. 1986లో లింగారావు ఇచ్చిన ఈ స్థల వారసులమని నాయినేని లింగారావు మనవళ్లు వినయ్, విజయ్ లు ఐలమ్మ విగ్రహ ప్రతిష్టాపన అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.





### ఈ భూమి మా తాతల ఆస్తి : మనవళ్లు వినయ్, విజయ్

ఈ భూమి మా తాత లింగారావుకు సంబంధించి భూమి అని నాయినేని లింగారావు మనవళ్లు వినయ్, విజయ్ లు తెలిపారు. కూకట్ పల్లి మండలం సర్వే నెంబర్ 174లో 2.15 ఎకరాలు, 175లో 1.30 ఎకరాల భూమి నాయినేని లింగా రావు, నాయినేని నర్సింగ్ రావులకు చెందిందన్నారు. గతంలోనే భూమి విక్రయించగా 14 వందల గజాలు మిగిలి ఉందని,మా భూమిని మేము స్వాధీనం చేసుకునేందుకు వచ్చామన్నారు. ఈ స్థలాన్ని రజకులకు ఇచ్చినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని, ఉంటే ఆధారాలను బహిర్గతం చేయాలని మనవళ్లు వినయ్, విజయ్ డిమాండ్ చేశారు.

## మన్నెంపల్లి శివారులో భారీ అగ్ని ప్రమాదం

**వరి కట్టలు, మక్క పంట, పవర్ టిల్లర్ దగ్ధం**



**మానకొండూర్, మే 22:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామ శివారులో శుక్రవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఎండల తీవ్రత కారణంగా పొలాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. దీంతో సమీపంలోని పంట పొలాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పొన్న సునీత అనిల్‌గౌడ్ వెంటనే స్పందించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థానిక రైతులతో కలిసి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రైతులు కూడా నీటి ట్యాంకర్లు, మోటార్ల సహాయంతో మంటలు వ్యాపించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో వరి కట్టలు, మక్క పంట, వ్యవసాయానికి ఉపయోగించే పైపులు, ఒక పవర్ టిల్లర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధిత రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. మంటలు మరింత వ్యాపించి ఉంటే సమీప పొలాలకు కూడా తీవ్ర నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత మరియు పొలాల్లో ఉన్న పొడి వ్యర్థాల వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకుని తగిన పరిహారం అందించాలని గ్రామ సర్పంచ్ పొన్న సునీత అనిల్‌గౌడ్ కోరారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత దేశబోయిన వెంకట్రాములు కన్నుమూత



**రంగారెడ్డి ప్రతినిధి, మే 22:** ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశ బోయిన వెంకట్ రాములు (75 ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మురారి పల్లిలో తన కుమారుడి స్వగృహంలో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన నర్రా రాఘవరెడ్డి పై 1985లో శాసనసభ్యుడిగా పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. అప్పటినుండి ఇప్పటివరకు కాంగ్రెసును అంటిపెట్టుకొని పార్టీకి అనేక సేవలు అందజేశారు, ఇది ఇలా ఉండగా దేశ బోయిన వెంకట్ రాములు భార్య దేశ బోయిన ( గోపగాని పార్వతమ్మ ) ఉమ్మడి నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు సర్పంచిగా పనిచేశారు. వెంకట రాములు కుమారుడు దేశబోయిన రవికుమార్ ప్రస్తుతం తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వారి కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీకి అంకితం అయ్యారు. శుక్రవారం సాయంత్రం వేములపల్లి మండలం ఆమనగల్లు లో దేశబోయిన వెంకట్ రాములు అంత్యక్రియలు జరిగాయి ఈ కార్యక్రమానికి దేశబోయిన కుటుంబ సభ్యులతో పాటు గోపగాని కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు హాజరై తమ సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రణాళికా సంఘం అధ్యక్షులు వనపర్తి మాజీ శాసనసభ్యులు జిల్లెల్ల చిన్నారెడ్డి దేశ బోయిన వెంకట్రాములకు అత్యంత సన్నిహితులు.

## ఇందిరమ్మ గృహాలతో పేద కుటుంబాల్లో ఆనందాలు

**కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి**



**కరీంనగర్, మే 22:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ నబి రేష్మల నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి హాజరై గృహ యజమానులను అభినందించి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహాల పథకం పేద ప్రజల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతోందన్నారు. గతంలో సొంతింటి కల కూడా కలగానే మిగిలిపోయేదని, ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల సహాయంతో నిరుపేద కుటుంబాలు గౌరవప్రదమైన జీవితం గడిపే అవకాశం పొందుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని, కూలీలు, మేస్త్రీలు, ట్రాక్టర్ యజమానులు, నిర్మాణ కార్మికులకు నిరంతరం పని లభిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. అనంతరం అబ్దుల్ నబి రేష్మ కుటుంబ సభ్యులతో కలిసి గృహాన్ని సందర్శించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనిల్, స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## లివడ్లు, మక్కల కొనుగోళ్లలో జాప్యం రైతులకు శాపంగా మారింది

**బీజేపీ ఆగ్రహ ధర్నా**




**కరీంనగర్, మే 22:** కరీంనగర్ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వడ్లు, మక్కల కొనుగోళ్లు తీవ్ర జాప్యానికి గురవుతూ రైతులు పడుతున్న ఇబ్బందులను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్నలు నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోవడంతో వర్షాలకు తడిసి నాణ్యత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, రైతు పండించిన పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా మరియు ఏఓ రాజు గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతు కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలి

**ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రసమయి ఫైర్**

**మానకొండూర్, మే 22:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతు పంట పండిస్తే ఆనందపడాల్సిన పరిస్థితి పోయి, ఇప్పుడు పంట అమ్ముకోవడానికి కూడా కష్టపడాల్సి వస్తోందని విమర్శించారు. రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండవేడిమిని తట్టుకోలేక, ఆందోళనతో కొందరు రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీలాపూర్ గ్రామానికి చెందిన రైతు బాలయ్య మృతి హృదయ విదారకమన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు రైతులు మృతి చెందినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రచారానికే పరిమితమయ్యారని, రైతుల కష్టాలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులపై బీ గ్రేడ్ పేరుతో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా బీ గ్రేడ్‌గా చూపిస్తూ బస్తాకు రూ.20 వరకు కోత విధిస్తున్నారని అన్నారు. బస్తాకు 43 కిలోల తూకం వేస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. పొద్దుతిరుగుడు, మక్కజొన్న రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. పంట కొనుగోలు చేసే దిక్కు లేక రైతులు నెలల తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సి వస్తోందని చెప్పారు. ప్రస్తుతం 60 శాతం ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉందని, వర్షాలు ప్రారంభమయ్యేలోపు ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం, మక్కలు, సన్‌ఫ్లవర్ పంటలను వెంటనే కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. అవసరమైతే క్యాంపు కార్యాలయం ఎదుట ధాన్యం పోసి నిరసన చేపడతామని స్పష్టం చేశారు.

